క్లుప్తంగా

అయోధ్య స్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



పెదకూరపాడు : మాస శివరాత్రి సందర్భంగా 75 తాళ్లూరు అయోధ్య స్వామి ఆశ్రమంలో వివిధ గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం, మాస శివ రాత్రి కావడంతో ఆదిత్య శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, అయోధ్య స్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మాస శివరాత్రి నిర్వహించిన గ్రామం పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లుతుందని పేర్కొన్నారు. ఆశ్రమ కమిటీ నిర్వాకులు పాల్గొన్నారు.

ఎకరాకు 33 బస్తాల ధాన్యం దిగుబడి అంచనా



నకరికల్లు: వరిలో పంట కోత ప్రయోగం ద్వారా దిగుబడి అంచనా వేస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. నకరికల్లులోని కగ్గా పద్మావతి అనే మహిళా రైతుకు వరి పొలంలో శుక్రవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు మీటర్ల పొడవు, వెడల్పు కలిగిన విస్తీర్ణంలో వరి పంటను కోత కోసి, నూర్పిడి చేయగా 16.790 కేజీల దిగుబడి వచ్చిందన్నారు. వచ్చిన దిగుబడిని బట్టి ఎకరాకు 32–33 బస్తాల దిగుబడి అంచనా వేశామన్నారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, వీఏఏలు షేక్.సుభాని, వై.ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

వరి గడ్డికి గిరాకీ



క్రోసూరు: వరి గడ్డికి గిరాకీ పెరిగింది. వరి కోతలు ఊపందు కోవడంతో క్రోసూరులో మోపు రూ.180కు విక్రయిస్తున్నారు. నకరికల్లు మండలంలోని గుళ్లపల్లి నుంచి ట్రాక్టర్‌పై తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు లోడు రూ.15వేలుగా నిర్ణయించారు. 80 నుంచి 110 వరకు వరి గడ్డి మోపులు ఉంటాయని విక్రేతలు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో ముమ్మరంగా వరిసాగు జరిగిందని, జనవరిలో కోతలు పూర్తిచేసుకుంటాయని, అప్పుడు గడ్డి ధర తగ్గొచ్చని చెబుతున్నారు.

సంగం బజార్‌లో చైన్ స్నాచింగ్

సత్తెనపల్లి: పట్టణంలోని సంగం బజార్‌లో శుక్రవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. వివరాల మేరకు.. పట్టణంలోని సంగం బజార్‌లో రేవతి గోపాలరావు వృద్ధుడు తన ఇంట్లో కూర్చుని ఉండగా గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి, అతని మెడలోని రెండున్నర తులాల బంగారు చైన్ బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. వృద్ధుడు కేకలు పెట్టడంతో స్థానికులు అక్కడికి రావడం జరిగిన విషయాన్ని చెప్పాడు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టారు.

ఆత్మహత్య చేసుకున్న మహిళ వివరాలు లభ్యం

అమరావతి: స్థానిక హిందూ శ్మశాన వాటిక సమీపంలో గురువారం ఆత్మహత్య చేసుకున్న మహిళను సత్తెనపల్లికి చెందిన జంపాల లీలావతి(49)గా గుర్తించారు. సీఐ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. జంపాల వెంకటరమణయ్య భార్య లీలావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. లీలావతికి మానసిక స్థితి బాగోలేనందువల్ల గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేసిందని వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం లీలావతి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

వెంకుపాలెం పాఠశాలలో డీఈవో తనిఖీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, వినుకొండ మండలంలోని వెంకుపాలెంలో గల ఎంపీపీ పాఠశాలను జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ సందర్శించారు. తరగతి గది వాతావరణం, విద్యార్థులు నేర్చుకుంటున్న ఫలితాలను గమనించి వారి పఠనం, రాత నైపుణ్యాలు, సామర్థ్యాలను పరీక్షించారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల క్లాస్ వర్క్‌బుక్‌లు, నోట్ బుక్‌లను ఆమె పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఆమె పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని వంట సిబ్బంది, ఆయాలకు సూచించారు. విద్యార్థుల చేతిరాత, వారి అభ్యాస ఫలితాలపై దృష్టి కేంద్రీకరించడానికి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

చిన్న చూపు..!

అంగన్‌వాడీ కేంద్రాలపై సర్కారు నిర్లక్ష్యం

- పూర్వ ప్రాథమిక విద్య అగమ్యగోచరం
- ఐదు నెలలు గడుస్తున్నా అందని పాఠ్యపుస్తకాలు
- పాత పుస్తకాలతోనే సాగుతున్న బోధన

ముప్పాళ్ళ: అహ్లాదకర వాతావరణంలో ఆట పాటలతో కూడిన విద్యనందించే అంగన్‌వాడీ కేంద్రాలపై సర్కారు చిన్నచూపు చూస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ తరహాలో ఇంగ్లీషులో పాఠాలు బోధించేందుకు గాను గత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టింది. అందుకు నాలుగు పుస్తకాలతో కూడిన కిట్‌లను ప్రభుత్వమే సరఫరా చేసింది. 2024–25 విద్యా సంవత్సరం సంబంధించి జూన్ నెలలో అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకున్నప్పటికీ నేటికీ అవసరమైన పాఠ్య పుస్తకాలు సరఫరా కాలేదు. సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సత్తెనపల్లి పట్టణం, మండలం, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 300 అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో సున్నా నుంచి ఏడాది లోపు 1,589 మంది చిన్నారులు, సంవత్సరం నుంచి మూడేళ్ల లోపు 6,904 మంది చిన్నారులు, మూడు నుంచి ఆరేళ్ల లోపు 4,094మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం కొత్త పాఠ్య పుస్తకాలు సరఫరా చేయకపోవడంతో పాత పుస్తకాలతోనే బోధన చేయాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే కేంద్రాలకు పుస్తకాలు అందేవి. ఇప్పటి కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీకేంద్రాలపై నిర్లక్ష్యం చూపుతుండటంతో విద్యాబోధన మొక్కుబడిగా మారింది. కొత్త పుస్తకాలు ఇస్తారో లేదో అన్న సందేహం తల్లిదండ్రుల్లో నెలకొంది.



చాగంటివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రం

నాడు పీపీ-1, పీపీ-2 కిట్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు నాలుగు రకాల పుస్తకాలను విద్యా సంవత్సరం ఆరంభంలోనే సరఫరా చేసింది. నాలుగు పుస్తకాలతో కూడిన బడ్స్-1, బడ్స్-2 కిట్లను అందించింది. వీటితో పాటు అంగన్ వాడీల్లో ప్రైవేటు కార్పోరేట్ పాఠశాలల మాదిరిగా ఇంగ్లీషు పాఠాలు బోధిస్తుంటే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. బోధనకు సంబంధించి రెండు నుంచి నాలుగేళ్ల లోపు చిన్నారులకు ఇంగ్లీషు, గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, యాక్టివిటీ డ్రాయింగ్స్ కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్ ను అందించేవారు. నాలుగేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్ అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నేటికీ పాఠ్యపుస్తకాలపై దృష్టి పెట్టక పోవడంపై చిన్నారుల విద్యాబోధన కుంటుపడాల్సిన దుస్థితి నెలకొంది.



గొల్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



గత ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలు

కూరగాయల బిల్లులు అంతంతే..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక వైపు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు సరఫరా చేయకపోవడమే కాక మరో వైపు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కూరగాయల బిల్లులు అంతంత మాత్రంగానే చెల్లిస్తోంది. ఆయా కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు పాలు, ప్రతి రోజు గుడ్డుతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఒక్కో చిన్నారికి గ్యాస్ బిల్లుతో సహా కూరగాయలకు సంబంధించి రూ.2.75 ప్రకారం చెల్లిస్తోంది. మార్కెట్‌లో కూరగాయల బిల్లులు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రభుత్వం చెల్లించే మొత్తం ఏ మాత్రం సరిపోవడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, గ్యాస్ రూపంలో ప్రభుత్వం చెల్లించే మొత్తానికి అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. కూరగాయల బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో అంగన్‌వాడీకేంద్రాల్లో చిన్నారులకు మధ్యాహ్నభోజన పథకం నిర్వహణ భారంగా మారింది. ప్రస్తుతం కూరగాయలు, గ్యాస్ రూపంలో ఇచ్చే మొత్తాన్ని రెట్టింపు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

పాఠ్య పుస్తకాలు సరఫరా కాలేదు

అంగన్‌వాడీ కేంద్రాలకు పీపీ-1, పీపీ-2 కిట్లు రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా కాలేదు. మరో వారంలో వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి అన్ని కేంద్రాల్లో పాత పుస్తకాలతోనే బోధన చేపడుతున్నాం.

–శ్రీలత, సీడీపీఓ, సత్తెనపల్లి ప్రాజెక్ట్

ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం సేవలు భేష్



సత్తెనపల్లి: ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం సేవలు భేష్ అని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురాం నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం నూతన కార్యవర్గం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి సత్కరించారు. నూతన కార్యవర్గం సంస్థ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని, మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు (కొండలు), గోశాల అధ్యక్షుడు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దోగిపర్తి సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం ఉన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు గ్రామంలో గత బుధవారం మాదిగ పల్లె మీద మైనార్టీలు దాడి చేయడాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడులు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని పేర్కొన్నారు. చిల్కా గోపిపై ఇంటిలోకి దూరి నిర్దాక్షణ్యంగా రాడ్లు, కత్తులతో చేయడం సరికాదని తెలిపారు. దోషులను అరెస్ట్ చేయకపోతే నియోజకవర్గ స్థాయిలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహణపై వినతి

అచ్చంపేట: నెలలో ఒక్కరోజైనా ఏదో ఒక గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి, సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఉమ్మడి గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప శుక్రవారం తహసీల్దారు జి.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో తహసీల్దారు అధ్యక్షతన ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో షెడ్యూలు చేయాలన్నారు. ఈ కమిటీలో స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజా సంఘాలు, ఎన్జీఓస్, దళిత గిరిజన నాయకులను కలుపుకుని గ్రామంలో సభ ఏర్పాటు చేసి, స్థానిక సమస్యలను తెలుసుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, విద్య, ఉపాధి, ఉద్యోగ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దారు డిసెంబరు నుంచి అన్ని శాఖలతో షెడ్యూలు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ సందెపోగు అశోక్ పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న డీబీఆర్సీ సభ్యులు

చిన్నారుల్లో లోపాలను గుర్తించడమే లక్ష్యం

బెల్లంకొండ: విద్యార్థుల్లో ఆరోగ్యపరమైన లోపాలను గుర్తించడమే 'రాష్ట్రీయ బాల స్వాస్థ్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె.వి కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులలో చర్మ వ్యాధులు, రూమాటిక్ గుండె జబ్బులు, దంత, చెవి, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు, మూర్ఛ వ్యాధులను త్వరితగతిన స్క్రీనింగ్ పరీక్షల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. ఈ రకమైన లక్షణాలు గల విద్యార్థులను గుర్తించి వారికి చికిత్స అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పరిశుభ్రత కార్యక్రమాలపై, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ మణికుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు, సిబ్బంది

మూగజీవి కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు

గొర్రెకు ఆపరేషన్ చేసి కేజీన్నర వ్యర్థాలను తీసిన డాక్టర్



రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు గొర్రె పొట్ట నుంచి కిలోన్నర ప్లాస్టిక్ వ్యర్థాలను శుక్రవారం పశువైద్యులు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి ఆపరేషన్ చేసి బయటకు తీశారు. ఆరేపల్లి గ్రామానికి చెందిన మిరపెల్లి వెంకటేశ్వర్లుకు చెందిన గొర్రె వారం రోజులుగా మేత తినడం లేదు. గొర్రెకు మందులు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేక గొర్రె బ్రతకదని ఆశలు వదిలేశాడు. గొర్రె మల ద్వారం గుండా వెళ్ళాల్సిన కసరు నోటి నుండి ముక్కు నుండి బయటకు రావటం మొదలైంది. యజమాని గొర్రెను పశువైద్యులు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డికి చూయించారు. గొర్రెకు పరీక్షలు నిర్వహించి కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గొర్రెకు రుమెనోటమీ ఆపరేషన్ చేశారు. పొట్టలో ఉన్న కేజీన్నర వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను బయటకు తీశారు. అవసరమైన మందులను ఇచ్చి గొర్రె ప్రాణాలు కాపాడారు. గొర్రె ప్రాణాలను కాపాడిన డాక్టర్ సాయి మహేష్‌రెడ్డికి యజమాని వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కాలంలోని గురజాల మండలం మాడుగులలో గేదె కడుపు నుంచి 2 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించగా, గత శనివారం కర్లకుంటలోని ఓ ఆవు పొట్ట నుంచి 6 కేజీల వ్యర్థాలను తీశారు. నేడు ఆరేపల్లి గ్రామానికి చెందిన ఓ గొర్రె పొట్ట నుంచి ఒకటిన్నర కేజీల ప్లాస్టిక్ ముక్కలను తొలగించి మూగజీవాల ప్రాణాలను కాపాడారు.

ప్లాస్టిక్‌తో మూగజీవాలకు ప్రాణాంతకం

ఈ సందర్భంగా పశు వైద్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం, వ్యర్థాల సరైన నిర్వహణ లేకపోవడం వల్ల మూగజీవాలకు ప్లాస్టిక్ ప్రాణాంతకంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో మూగ జీవాల రక్షణ కోసం ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దయచేసి ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, వ్యర్థాలను ఎక్కడా పడవేయకుండా వాటిని నాశనం చేయాలని సూచించారు. అప్పుడే పర్యావరణ సమతుల్యం, మూగజీవాలకు పొంచి ఉన్న ప్రాణముప్పు తొలుగుతుందన్నారు.

విద్యుత్ సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంభొట్లు

బొల్లాపల్లి : మండలంలోని బండ్లమోటు, మూగచింతలపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. రాంభొట్లు శుక్రవారం తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌ల, రికార్డులను పరిశీలించారు. రైతులకు వ్యవసాయానికి సంబంధించి సరఫరాలో అంతరాయం ఉన్నందున త్వరలో పరిష్కరిస్తామన్నారు. మూగచింతలపాలెం సబ్ స్టేషన్‌లో మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్) ఏర్పాటు చేస్తున్నామని, గుట్లపల్లి నుంచి వెల్లటూరు సబ్ స్టేషన్ వరకు నూతన కరెంటు లైన్ నిర్మాణంలో ఉందన్నారు. రెండు నెలల్లో కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. శ్రీనివాసరావు, ఏఈఈ వి.వెంకట్రావు, సబ్ ఇంజనీర్ బి. రామాంజనేయులు నాయక్ తదితరులు ఉన్నారు.



సబ్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఈఈ, డీఈఈ

నాట్య మండలి వ్యవస్థాపకుడు మృతి



అమరావతి: శ్రీ సాయి నటరాజ నాట్య మండలి వ్యవస్థాపకుడు పాదిలి మల్లేశ్వరరావు మృతి ప్రజానాట్య మండలికి తీరనిలోటని ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ అన్నారు. ప్రజానాట్య మండలి కళాకారుడు మల్లేశ్వరరావు శుక్రవారం స్వగ్రామం పెద్ద మద్దూరులో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని బైరాపట్నం రామకృష్ణ, మండలి మండల గౌరవాధ్యక్షుడు జాస్తి సత్యమూర్తి సందర్శించి, నివాళులర్పించారు. విశ్వామిత్ర, సత్య హరిశ్చంద్ర, శంకరుడు వెంకటేశ్వర స్వామి తదితర అనేక పాత్రలను ప్రదర్శించి, ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని మల్లేశ్వరరావు సాధించుకున్నారని తెలిపారు. మండలి సభ్యులు ఎస్కే సత్తార్, జి.రాజు, బత్తిన రామయ్య తదితరులున్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం మోడల్ స్కూల్ కళాశాల విద్యార్థులు శుక్రవారం నరసరావుపేటలో పారిశ్రామిక సందర్శన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి. రవినాయక్ మాట్లాడుతూ పారిశ్రామిక సందర్శన అనేది బోధనలో అత్యంత వ్యూహాత్మక పరస్పర చర్యలతో కూడిన పద్ధతి అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ సందర్శనలో పాల్గొని ఎన్నో విషయాలను స్వయంగా చూసి అవగాహన చేసుకున్నారు. ఒకేషనల్ అధ్యాపకులు ఎస్. తిరుమల, బి. నారపరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

చిలకలూరిపేట టౌన్: తల్లిదండ్రులు, గురువులు సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంఈఓ కె.లక్ష్మి తెలిపారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం బాల్య వివాహ రహిత ముక్త్ భారత్ కార్యక్రమం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలబాలికలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎంఈఓ లక్ష్మీతోపాటు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శాంతకుమారి, సూపర్‌వైజర్లు ఎస్.భాగ్యలక్ష్మి, ఆర్.సామ్రాజ్యం బాలల హక్కులు, చట్టాలు, అక్రమ తరలింపు, వాటి నిరోధంపై ప్రసంగించారు.

అజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన మార్కాపురం రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పాటు పట్టణంలో తాగునీటి సమస్య, విద్యుత్, మురుగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా అజెండాలోని అంశాలను ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కౌన్సిలర్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను వ్యతిరేకిస్తున్నాం

సత్తెనపల్లి: దళితుల స్థితిగతులను అధ్యయనం చేసే అధికారం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు లేదని మాల మహానాడు సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాలే పద్మారావు అన్నారు. శుక్రవారం జరిగిన మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్‌బాబు అధ్యక్షత వహించారు. పద్మారావు మాట్లాడుతూ రాష్ట్రంలో మాల, మాదిగలను విడగొట్టే ఆలోచన ప్రభుత్వాలు చేయడం చాలా దారుణమన్నారు. సుప్రీం కోర్టు ఆగష్టు ఒకటిన ఇచ్చిన తీర్పులో 2021 జనాభా లెక్కలు జరపకుండా, వెనుకబడిన వర్గాలను గుర్తించకుండా ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా వేసిన రాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా మాలలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆ కమిషన్‌ను ఎత్తి వేసే దిశగా హైకోర్టులో పిల్ వేశామని, కేవలం ఎస్సీ వర్గీకరణ కోసమే డీఎస్సీకి సంబంధించిన నోటిఫికేషన్ నిలిపియడం చాలా బాధాకరమన్నారు. మాలలు రానున్న రోజుల్లో ఏకతాటి పైకి రావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం కేవలం రిజర్వేషన్ ఎత్తివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. ఉమ్మడి రిజర్వేషన్ పెంపునకు మాదిగ సోదరులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మనికే మహేష్, పట్టణ వర్కింగ్ అధ్యక్షుడు జూపల్లి స్వామి, ముప్పాళ్ళ మండల అధ్యక్షుడు సేవా చంద్ర, ఉద్యోగ సంఘాల నియోజకవర్గ అధ్యక్షుడు మాలే మరియ దాసు, మాల సంఘ నాయకులు కోడిరెక్క దేవదాసు, దాసరి జ్ఞానరాజ్ పాల్, గంజి మాల రాజారావు ఉన్నారు.



మాట్లాడుతున్న మాలే పద్మారావు, పక్కన నాయకులు

జీవామృతంతో అనేక ప్రయోజనాలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని, రైతులు జీవన ఎరువుల వాడకం పెంచాలని డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్‌లు డాక్టర్ జి.రమేష్, సి.సంధ్యారాణి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీవామృతం తయారీ, లాభాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్లు డా.జి.రమేష్, సి.సంధ్యారాణి మాట్లాడుతూ అందుబాటులో ఉండే దేశి ఆవు పేడ, మూత్రం, బెల్లం, మట్టితో తయారు చేసుకోవచ్చన్నారు. ఈ మిశ్రమాన్ని 48 గంటల తర్వాత పిచికారి చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటుగా మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. ప్రకృతిని కాపాడుకోవచ్చన్నారు. జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఎం.కవితారెడ్డి, దివ్య, నాగమణి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జి.రమేష్, సంధ్యారాణి

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి

నోబుల్ టీచర్స్ రాష్ట్ర ఆదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ నాగేశ్వరరావు

శావల్యాపురం: 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నోబుల్ టీచర్స్ నూతన క్యాలెండరు అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అనవసరపు యాప్స్ రద్దు చేయాలని, అపార్ బాధ్యతల నుండి ఉపాధ్యాయులను తప్పించాలన్నారు. తెలుగు మాధ్యమాన్ని పురరుద్ధచాలన్నారు. ఉపాధ్యాయులకు పేరుకుపోయిన పెండింగ్ బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, 11వ పీఆర్సీ బకాయిలు 90 నెలల పెండింగ్ డీఏలను ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. గత ఆరు నెలలుగా ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపిజీఎల్ఐ బకాయిలు కోట్ల రూపాయలలో పేరుకుపోయానని వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్పొరేషన్, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా రేషనలైజేషన్ చేసి నూతన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖాధికారి పోస్టులను భర్తీ చేయాలన్నారు. గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మిస్సింగ్ క్రెడిట్స్ క్లియర్ చేయకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల పదవీ విరమణ అనంతరం చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరగటంతో పాటు మిస్ అయిన అమౌంటు వేలలో కోల్పోవడం జరుగుతుందన్నారు. సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమ పోరాటాలు ఆందోళనలు తప్ప మరోక మార్గం లేదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.సాంబశివరావు, ఎంఎస్ రావు, కార్యవర్గ సభ్యులు గద్దె రామకోటేశ్వరరావు, మురుగొండ శ్రీనివాసరావు, జాకీర్ హుస్సేన్, చేపూరి రమేష్, ఉన్నారు.



నోబుల్ టీచర్స్ క్యాలెండరు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు